వేగంగా.. సులభంగా

● నగదు రహిత లావాదేవీలు
● స్మార్ట్ ఫోన్లతో డిజిటల్ చెల్లింపులు


డిజిటల్ చెల్లింపులు చేస్తున్న కొనుగోలుదారుడు

పెద్దవంగర: డబ్బులు కావాలా.. పదా ఏటీఎంకు వెళ్దాం.. నా దగ్గర డబ్బులు లేవు.. ఇదిగో కార్డు తీసుకపోయి డబ్బులు డ్రా చేసుకొమ్మని దశాబ్దం క్రితం అనేవాళ్లం. ప్రస్తుత ఆధునిక యుగంలో టెక్నాలజీ మరింత పెరిగి విపరీతంగా అభివృద్ధి చెందింది. నేటి సమాజంలో స్మార్ట్ ఫోన్‌లు ప్రతీ ఒక్కరి చేతిలో దర్శన మిస్తూనే ఉన్నాయి. ఫోన్లలో ఫోన్ పే, గూగుల్ పేతోపాటు పలు రకాల పేమెంట్ యాప్‌లు అందుబాటులో ఉండడంతో నగదు రహిత లావాదేవీలు ప్రజలకు సులభంగా మారాయి. డిజిటల్ టెక్నాలజీతో బ్యాంక్ సేవలను ఇరవై నాలుగు గంటలపాటు ఇంటి నుంచే వినియోగించుకుంటున్నారు. నోట్ల రద్దు, కరోనా కాలం అనంతరం ప్రజలు డిజిటల్ చెల్లింపులకు అలవాట్లు పడ్డారు. ప్రస్తుతం ఎక్కడ చూసిన నగదు రహిత లావాదేవీలు జరుపుతున్నారు. గతంలో నగదు లావాదేవీలు జరపాలంటే బ్యాంకులు, ఏటీఎంల వద్ద గంటల తరబడి క్యూలైన్లో వేచి ఉండేవారు. వీటిని దృష్టిలో పెట్టుకొని ఆర్‌బీఐ నియంత్రణ సంస్థ నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్ఫేస్) వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఒక బ్యాంక్ ఖాతా నుంచి మరో బ్యాంక్ ఖాతాకు క్షణాల్లో నగదు బదిలీ చేసే వెసులుబాటు కల్పించింది.

Sunday Special

టీ కొట్టు నుంచి పెట్రోల్ దాకా..

గ్రామాల్లో సైతం ఆన్‌లైన్ షాపింగ్ జోరుగా కొనసాగుతుంది. అమెజాన్, ఫ్లిప్‌కార్టు, మీషో, వంటి యాప్‌ల ద్వారా అవసరమైన వస్తువులను ఆర్డర్ చేస్తున్నారు. టీ కొట్టు, పెట్రోల్‌బంకు, పాన్ షాపు, కూరగాయలు, కిరాణం దుకాణాల్లోకి వెళ్లిన ఎక్కడికి వెళ్లిన క్యూఆర్ కోర్డులు ఉండడంతో డిజిటల్ పేమెంట్లు చకచక చేస్తున్నారు.

బ్యాంకులకు వెళ్లాల్సిన అవసరం లేదు



గతంలో ఏటీఎంల వద్ద బ్యాంకుల వెళ్లి లైన్‌లో నిలబడి ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. స్మార్ట్ ఫోన్‌ల ద్వారా నగదు రహిత లావాదేవీలు జరుపుకునేందుకు వీలుగా ఎన్నో యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. దీంతో ఎక్కడి వెళ్లిన ఆన్‌లైన్ పేమెంట్లు చేస్తున్నాం.

– మైలపాక అనిల్, పోచంపల్లి

కనీస వేతన చట్టం అమలు చేయాలి


నెల్లికుదురు: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

నెల్లికుదురు/తొర్రూరు/పెద్దవంగర: కనీస వేతన చట్టం అమలుకు బాధ్యులందరు కలిసి నాడవాలని ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి పిలుపునిచ్చారు. స్థానిక కేజీబీవీలో కనీస వేతన చట్టం అమలు కోసం ఆగస్టు 4న హైదరాబాద్‌లో జరిగే కార్మిక గర్జనను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేజీబీవీలో పనిచేస్తున్న సుమారు 600వందల మంది నాన్ టీచింగ్ సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న కార్మిక గర్జనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇరుగు అనిల్, అనిత, పద్మ, లక్ష్మి, వెంకటమ్మ, కల్యాణి, విజయ పాల్గొన్నారు.

ఏజెన్సీ డీఎస్సీ నిర్వహించాలి


మాట్లాడుతున్న శ్రీనివాస్

బయ్యారం: ఏజెన్సీ ప్రాంత ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఏజెన్సీ డీఎస్సీని నిర్వహించాలని ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం మండలకేంద్రంలో జరిగిన సంఘం జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ గ్రామాల్లో ఏజెన్సీ ఉపాధ్యాయుల నియామకంతో విద్య పటిష్టమవుతుందన్నారు. అనంతరం ఎటీఎఫ్ జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సిద్దబోయిన బిక్షమయ్య, ఉపాధ్యక్షుడిగా రామకృష్ణ, విజయశాంతి, ప్రధాన కార్యదర్శిగా భాస్కర్‌రావు, ప్రచార కార్యదర్శి రవీందర్‌రావు, కోశాధికారిగా లక్ష్మినారాయణలు ఎన్నికయ్యారు. ఈసమావేశంలో ఎటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి, కృష్ణ, వెంకటేశ్వర్లు, లింగరాజు, రమేష్‌బాబు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె


బయ్యారం: సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న మురళీతారకరామారావు

మహబూబాబాద్ రూరల్ : రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీ ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు తెలంగాణ మున్సిపల్ ఎంపాయిస్ అసోసియేషన్ మహబూబాబాద్ జిల్లా కమిటీ మద్దతును ప్రకటించింది. అసోసియేషన్ జిల్లా నాయకులు సింగు రమేష్, మున్సిపల్ ఎంప్లాయిస్ నాయకులు కడారి రామస్వామి, ఉద్యోగుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్మారపు సుధాకర్, సంఘం జిల్లా అధ్యక్షుడు రత్నం అశోక్, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

మహబూబాబాద్: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు.

డోర్నకల్: జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం పదో రోజుకు చేరుకుంది. కార్మికులు వెంకటేశ్వర్లు, వీరన్న, గణేష్, రజినికాంత్ పాల్గొన్నారు.

కురవి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్మికులు, సిబ్బంది చేపట్టిన నిరవధిక సమ్మెకు ఎల్ఐసీ యూనియన్ కార్యదర్శి శ్యామల మోహన్‌రెడ్డి శనివారం మద్దతు పలికారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ పోతుగంటి మల్లయ్య, వికలాంగుల హక్కుల వేదిక కార్యదర్శి సయ్యద్ ఖాజా, సంఘం పాల్గొన్నారు.

బయ్యారం: తెలంగాణ జనసమితి జిల్లా నాయకులు గిన్నారపు మురళీతారకరామారావు జీపీ సిబ్బందికి సంఘీభావం తెలిపారు.

గార్ల: మండలంలోని పంచాయతీ కార్మికులు అన్ని పంచాయతీల్లో బైక్ ర్యాలీ నిర్వహించి తమ నిరసన తెలిపారు. కార్మికులందరికీ చిన్నకిష్టాపురం సర్పంచ్ గంగావత్ రుక్మిణీ హరికిషన్ అన్నదానం చేశారు.

గుండ్రాతిమడుగును అభివృద్ధి చేశా

● ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

కురవి: గుండ్రాతిమడుగు(విలేజి), పెద్దతండా, బంగారుగూడెం గ్రామాలను మొదటి నుంచి ఇప్పటి వరకు తానే అభివృద్ధి చేశానని ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. శనివారం మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజి), పెద్దతండా, బంగారుగూడెం తండా గ్రామాల్లో ఎమ్మెల్యే రెడ్యానాయక్ పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. గుండ్రాతిమడుగులో ఇంటి స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. బండి భారతమ్మను, ప్రస్తుతం బండి వెంకటరెడ్డిని జెడ్పీటీసీని చేశామన్నారు. అయినా ఈ గ్రామంలో తనకు మైనస్ ఓట్లు పడుతున్నాయని వివరించారు. పెద్ద తండాకు చెందిన సత్యవతిరాథోడ్‌ను బీఆర్ఎస్ మంత్రిని చేసిందని, ఇప్పుడు అందరం ఒకే పార్టీలో ఉన్నామని అన్ని ఓట్లు కారు గుర్తుకు వేయాలని సూచించారు. తొలుతు గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో రెడ్యానాయక్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జీవన్, ఎంపీటీసీ గుగులోత్ జ్యోతివిష్ణు, సొసైటీ చైర్మన్ గార్లపాటి వెంకటరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ గార్లపాటి భరద్వాజ్‌రెడ్డి, ఎంపీపీ గుగులోత్ పద్మావతి, ఆర్‌బీఎస్ కో–ఆర్డినేటర్ ముండ్ల రమేష్, ఆత్మ చైర్మన్ తోటలాలయ్య, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి బజ్జూరి పిచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి

తొర్రూరు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్థానికులు కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్ అన్నారు. డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలోనే అత్యధిక విద్యార్థులున్న స్థానిక పాఠశాలలో స్కావెంజర్లు, ఇద్దరు పీఈటీల అవసరం ఉందని, పాఠశాల పరిధిలోని షాపింగ్ కాంప్లెక్స్ నిధులను కొంత మొత్తం వినియోగించుకునేలా అధికారులకు నివేదించాలని తీర్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సరస్వతి, వీఎంఎఫ్ డైరెక్టర్ తక్కెళ్లపల్లి రవీంద్ర, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, హెచ్‌ఎం బీవీరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భగీరథ నీటిని సరఫరా చేయాలి

కేసముద్రం: మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామంలోని దళిత కాలనీకి మిషన్ భగీరథ నీటిని, వెంటనే సరఫరా చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలి

చిన్నగూడూరు: ఆర్టీసీ బస్సును పునరిద్ధరించాలని సర్పంచ్ విద్యులత ఆధ్వర్యంలో గ్రామస్తులు మండలంలోని విస్సంపల్లి బస్టాండ్ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. మండల కేంద్రంతో పాటు జిల్లా కేంద్రానికి వివిధ అవసరాల నిమిత్తం ప్రజలు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.

శ్మశానవాటిక నిర్మాణం అడ్డుకున్న రైతులు


రైతుల భూపత్రాలను పరిశీలిస్తున్న ఎస్సై

మరిపెడ: మండల కేంద్రంలో కూన్యతండా సమీపంలో నిర్మిస్తున్న శ్మశానవాటికను కొందరు రైతులు అడ్డుకున్నారు. నిర్మాణం తలపెట్టిన స్థలంలో మా భూములు ఉన్నాయని ఆరోపిస్తూ రైతులు పనులను నిలిపివేస్తుండగా సంఘటనా స్థలానికి ఎస్సై పవన్‌కుమార్ తన సిబ్బందితో చేరుకొని రైతులతో మాట్లాడారు. భూమికి సంబంధించిన కాగితాలుంటే తహసీల్దార్ దగ్గరకు వెళ్లాలని, ప్రభుత్వం చేపడుతున్న పనులను అడ్డుకోవద్దని సూచించారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ రాజును వివరణ కోరగా తహసీల్దార్ ప్రభుత్వ భూమి అని నిర్ధారించిన తర్వాతే శ్మశానవాటిక నిర్మిస్తున్నామన్నారు. వారికి ఆధారాలుంటే రెవెన్యూ అధికారులు, కోర్టుకు వెళ్ల వచ్చని ఆయన సూచించారు.

విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం


తొర్రూరు: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

తొర్రూరు: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తోందని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గంగధారి సిద్దు అన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఆగస్టు 1న హైదరాబాద్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో జరిగే బహిరంగ సభ పోస్టర్లను శనివారం డివిజన్ కేంద్రంలో సంఘ నాయకులు ఆవిష్కరించారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనా సర్కారు పాఠశాలల్లో నోటు పుస్తకాలు, యూనిఫాంలు పూర్తి స్థాయిలో అందలేదన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల దోపిడీని ప్రభుత్వం నియంత్రించడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, మనోజ్, సాయి, నవ్య, శ్రీవాణి, రవి పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

గార్ల: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని గోపాలపురం హైస్కూల్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు మహేష్‌కుమార్ మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు మన బడి పథకం పనితీరు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న చందంగా నేటికీ పూర్తిగా అమలుకు నోచుకోలేదన్నారు. కార్యక్రమంలో పవన్, నరేష్, పృథ్వీరాజ్, పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

లైంగిక వేధింపులపై కేసు నమోదు

డోర్నకల్: మండలంలోని పెరుమాళ్లసంకీస గ్రామంలో మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు డోర్నకల్ ఎస్సై శ్యాంసుందర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. భర్తతో మనస్పర్ధల కారణంతో గ్రామంలో తల్లి వద్ద ఉంటున్న మహిళపై అదే గ్రామానికి చెందిన పోగుల రాజు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని బాధితురాలి నుంచి అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దొరికిన చైన్ స్నాచర్



నిందితుడిని చూపుతున్న పోలీసులు

చిన్నగూడూరు: ఈనెల 14న మండలంలోని విస్సంపల్లిలో చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన ఆటో డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. ఎస్సై సంతోష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మరిపెడ కస్బా తండాకు చెందిన బానోత్ నగేష్ వృత్తిరీత్యా ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్న సమయంలో కురవి మండలం అయ్యగారిపల్లికి చెందిన గజ్జి లింగమ్మ చిన్నగూడూరు మండలం విస్సంపల్లిలోని తన కూతురు ఇంటికి నగేష్ ఆటోలో వచ్చింది. ఇంటి వద్ద ఎవరు లేకపోవడంతో ఇంటి ముందు కూర్చోవడంతో గమనించిన ఆటో డ్రైవర్ నల్లపూసల(1.5 తులాలు) గొలుసును లాక్కొని ఆటోలో పరారయ్యాడు. ఇట్టి విషయమై బాధితురాలు తన కుటుంబ సభ్యులతో శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సంతోష్ కుమార్ తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

డోర్నకల్: స్థానిక సుభాష్‌వీధికి చెందిన యాకూబ్ పాషాకు ద్విచక్ర వాహనం ఈనెల 12వ తేదీ అర్ధ రాత్రి చోరీకి గురైందని బాధితుడు శనివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్యాంసుందర్ తెలిపారు.

లారీని ఢీకొట్టిన డీసీఎం

దంతాలపల్లి: లారీని వెనుక నుంచి డీసీఎం వ్యాన్ ఢీ కొట్టిన సంఘటనలో లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి మండల కేంద్రంలో యూనియన్ బ్యాంక్ వద్ద గ్రానైట్ లోడుతో ఉన్న లారీని ప్రమాద సూచికలు లేకుండా నిలిపి ఉంచాడు. దీంతో వెనకు నుంచి వచ్చిన డీసీఎం వ్యాన్ ఢీకొన్నది. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. రోడ్డుపై ఎలాంటి జాగ్రత్తలు లేకుండా లారీ ఆపిన డ్రైవర్ నాగరాజుపై డీసీఎం డ్రైవర్ చింత నవీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై కూచిపూడి జగదీష్ తెలిపారు.

అనారోగ్యంతో హెచ్‌ఎం మృతి

తొర్రూరు రూరల్: అనారోగ్యంతో ఓ ప్రధానోపాధ్యాయుడు మృతి చెందిన సంఘటన మండలంలోని పోలెపెల్లిలో శనివారం చోటు చేసుకుంది. పోలెపెల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న కొత్త జితేందర్‌రెడ్డి(55) అనారోగ్యంతో గత కొన్ని నెలలుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈక్రమంలో జితేందర్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఉదయం మృతి చెందాడు.

సంక్షిప్త సమాచారం

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

డోర్నకల్: మున్సిపాలిటీ పరిధిలో నీటిఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న తెలిపారు. స్థానిక బతుకమ్మ చెరువులో బోరుబావికి అమర్చిన నూతన విద్యుత్ మోటార్‌ను శనివారం చైర్మన్ వీరన్న ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కోటిలింగం, కమిషనర్ మున్వర్ అలీ పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎస్సై

కురవి: సీరోలు మండలం చింతపల్లి శివారులోని టోల్‌ప్లాజా వద్ద 365 జాతీయ రహదారిపై శనివారం మతిస్థిమితం లేని ఓ వృద్ధుడు తిరుగుతుంతున్నాడు. గమనించిన సీరోలు ఎస్సై రమాదేవి వృద్ధుడి వివరాలను తెలుసుకుని సొంత ఊరు బీమవరం వెళ్లేందుకు సహకరించి మానవత్వం చాటుకున్నారు.

బహుమతులు అందజేత

డోర్నకల్: గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కోవిల సింధు అందజేసిన రూ.2వేల విలువ చేసే స్టీల్ గ్లాసులను హెచ్‌ఎం మరియామాణిక్యం విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోవిల రాజేశ్వర్, శ్యాంబాబు, మాధవరావు, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

చెక్కు పంపిణీ

నర్సింహులపేట: మండలంలోని పెద్దనాగారం గ్రామానికి చెందిన కృష్ణకు బీసీ కార్పొరేషన్ నుంచి మంజూరైన రూ.లక్ష చెక్కును శనివారం ఎంపీపీ టేకుల సుశీల అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కళమ్మ, ఉప సర్పంచ్ ఉప్పలయ్య, యాద గిరిరెడ్డి పాల్గొన్నారు.

బెంచీల ఏర్పాటు

నెహ్రూసెంటర్: ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని తొర్రూర్ బస్టాండ్ పాయింట్, కురవి గేట్ పాయింట్ వద్ద 6 బెంచీలను ఏర్పాటు చేసినట్లు డీఎం విజయ్ శనివారం తెలిపారు.

క్షయ వ్యాధి నివారణపై అవగాహన

గార్ల: మండలంలోని ముద్దివంచలో శనివారం క్షయ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డాక్టర్ డి.రాము ప్రజలకు అవగాహన కల్పించారు. క్షయ వ్యాధి రోగులు మద్యం, ధూమపానం పూర్తిగా మానేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కుసిని బాబూరావు, ఎస్‌టీఎస్ జయరాం, రాధాకృష్ణ, ఏఎస్‌ఎంలు పాల్గొన్నారు.

రోడ్లపైకి రాకుండా చూసుకోవాలి

మహబూబాబాద్: పశువుల పెంపకందారులు తమ పశువులను రోడ్లపైకి రాకుండా చూసుకోవాలని మున్సిపల్ కమిషనర్ టి.ప్రసన్నరాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పశువులు రోడ్డుపైకి రావడంతో వాహన ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. రోడ్లపై తిరిగితే పశువుల బందెల దొడ్డికి తరలించి భారీగా జరిమానా విధిస్తామని తెలిపారు.

దివ్యాంగులకు బస్‌పాస్ మేళా

నెహ్రూసెంటర్: ఆర్టీసీ ఆధ్వర్యంలో దివ్యాంగులకు బస్‌పాస్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డీఎం జె.విజయ్ శనివారం తెలిపారు. ఈనెల 19వ తేదీన జంగిలిగొండ కొత్తూర్, 20న గుండంరాజుపల్లి, పగిడిపల్లి, 21వ తేదీన కౌసల్యదేవిపల్లి, జయపురం, కొమ్ములవంచ, 24న నర్సింహులపేట, వంతడుపుల, 26న బిరిశెట్టిగూడెం, దాట్ల, 29న చిల్లంచెర్ల, రాంపూర్, నాగారంలో దివ్యాంగులకు బస్‌పాసులు అందజేయనున్నట్లు తెలిపారు.

ఐఐటీలో సీటు సాధించిన విద్యార్థి

మహబూబాబాద్ అర్బన్: జార్ఖండ్‌లోని రాంచిలో ఎన్ఐటీలో నలంద జూనియర్ కళాశాల విద్యార్థి ధారవత్ ఉపేందర్ ఐఐటీ సీటు సాధించాడని కరస్పాండెంట్ డాక్టర్ డోలి సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీపాల్‌రెడ్డి శనివారం తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ శంకర్ పాల్గొన్నారు.

స్థానికంగా ఉండని వార్డెన్లపై చర్య తీసుకోవాలి

మహబూబాబాద్: స్థానికంగా ఉండని వార్డెన్‌లపై చర్య తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శి మధు, సాయి కుమార్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సింహాద్రి, నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టాలి

డోర్నకల్: గ్రామాల్లో సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు చర్య చేపట్టాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాధ్విజ కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సీజనల్ వ్యాధులపై నిర్వహించిన సమావేశంలో సాధ్విజ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీఓ మున్వర్‌బేగ్, సీహెచ్ఓ వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి

కురవి: మండలంలోని అయ్యగారిపల్లి గ్రామంలో కొందరు వ్యక్తులు యాదవ కులస్తులను కులం పేరుతో దూషించి చంపుతామని బెదిరించిన వారిపై చర్య తీసుకోవాలని అయ్యగారిపల్లి గ్రామానికి చెందిన యాదవ కులసంఘం నాయకులు, సభ్యులు శనివారం కురవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయ్యగారిపల్లి గ్రామంలో శుక్రవారం గ్రామానికి చెందిన వడ్లకొండ రాములు, శ్రీను, ఉపేందర్, డ్రైవర్ రాములుతోపాటు మరికొందరు వ్యక్తులు అనిల్ కుమార్ అనే వ్యక్తి ఇంటిపైకి వచ్చి అనిల్‌ను కొట్టినట్లు కులం పేరుతో దూషించినట్లు యాదవకులస్తులు నాగన్న, అశోక్, దర్గయ్య, వెంకన్న శనివారం తెలిపారు. యాదవ కులస్తులను కులం పేరుతో దూషించలేదని పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు.

పిల్లలపై శ్రద్ధ వహించాలి

దంతాలపల్లి: తల్లిదండ్రులు పిల్లల పట్ల శ్రద్ధ వహించాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బుధారపు శ్రీనివాస్, శంకరయ్య అన్నారు. మండల కేంద్రంలో గల జిల్లా ప్రజాపరిషత్ సెకండరీ పాఠశాల, పెద్దముప్పారం ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు.

రథయాత్ర పోస్టర్ల ఆవిష్కరణ

బయ్యారం: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ఈనెల 20 న టీఎస్‌సీపీఎస్‌ఈయూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సంకల్ప రథయాత్రను జయప్రదం చేయాలని కోరుతూ ముద్రించిన పోస్టర్లను శనివారం బయ్యారంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్సై ఉపేందర్, డీఆర్ఓ రమేష్, నాయకులు రవిందర్, శ్రీకాంత్, రామారావు, దస్తగిరి, రవి, రాజు పాల్గొన్నారు.

శనిత్రయోదశి పూజలు

మహబూబాబాద్ రూరల్ : శనిత్రయోదశి పూజలను మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా శనివారం భక్తులు భక్తిశ్రద్దలతో ఘనంగా నిర్వహించారు. భక్తులు దేవాలయాలకు వెళ్లి శివుడికి, శ్రీవెంకటేశ్వర స్వామివారికి, శనీశ్వరుడికి పూజలు చేశారు.

బీజేపీ సీనియర్ నాయకుడి మృతి



పెద్దవంగర: మూడు దశాబ్దాలుగా ఏ పార్టీ మారకుండా నిబద్ధత, అంకిత భావంతో బీజేపీ సిద్ధాంతానికి కట్టుబడి పనిచేసి తనదైన ముద్ర వేసుకున్న బీజేపీ సీనియర్ నాయకుడు గడపురం భిక్షపతి (80) కన్ను మూశాడు. మండలంలోని గంట్లకుంట గ్రామానికి చెందిన భిక్షపతి ఇటీవల వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారు జామున మృతి చెందాడు. మూడు దశాబ్దాల కాలంలో గ్రామంలో వార్డు మెంబర్, సర్పంచ్, ఎంపీటీసీగా పార్టీ పలుమార్లు పోటీ చేసి ఓటమి పొందాడు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఒద్దిరాజు రాంచందర్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లేగ రామ్మోహన్ రెడ్డి, తదితరులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి



మహబూబాబాద్ అర్బన్ : గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై జూలై 17న స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని గిరిజన బాలుర పాఠశాలలో శనివారం మల్లారెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలోని గురుకులాల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. గురుకులాల సొసైటీలను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి ఏకరూప పరిపాలనా అమలు చేయాలని కోరారు. గురుకుల పాఠశాలలో కేర్ టేకర్లు, డిప్యూటీ వార్డెన్ లను నియమించి నైట్ డ్యూటీ నుంచి మినహాయించాలన్నారు. పనిభారం, మానసిక ఒత్తిడి తగ్గించి, బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో షేక్ యాకూబ్, హరినాయక్, సంజీవ, శ్రీనివాస్, కుమార్, రాంజీ, లక్ష్మయ్య, వెంకన్న పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎంహెచ్‌డీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రవీందర్

నెహ్రూసెంటర్: మాదిగ హక్కుల దండోర (ఎంహెచ్‌డీ) మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా జినుక రవీందర్‌ను నియమిస్తున్నట్లు సంఘం జాతీయ అధ్యక్షుడిజీ దండు సురేందర్, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కొంగరి శంకర్, దర్శనం రామకృష్ణ శనివారం తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి

డోర్నకల్: పట్టణంలోని ప్రధాన కూడళ్లతోపాటు వీధుల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు, వ్యాపారులు సహకరించాలని సీఐ బి.ఉపేందర్‌రావు కోరారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుపై శనివారం నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, ఎస్సై శ్యాంసుందర్, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు పోరాడదాం

నెహ్రూసెంటర్: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ కోసం మాదిగలందరూ ఐక్యంగా పోరాడాలని ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ బిర్రు మహేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌజ్‌లో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్పీ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం శాగంటి రమేష్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా మహేందర్ మాట్లాడుతూ.. ఆగస్టులో హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాదిగల విశ్వరూప సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంఎస్పీ జిల్లా కన్వీనర్ గుగ్గిళ్ల పీరయ్య, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర దుప్పెల్లి అనిల్‌కుమార్, ఎంఎస్పీ మహిళా జిల్లా అధ్యక్షురాలు ఎండి.రజియా పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి

మహబూబాబాద్: శివారు కాలనీల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు సహకరించాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి కోరారు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని 22, 36వ వార్డులతోపాటు 25 వార్డులోని ధర్మన్న కాలనీ సీసీ రోడ్లు , డ్రెయినేజీ నిర్మాణం కోసం నిధులు కేటాయించాని సీపీఐ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావును నాయకులు కలిశారు. కార్యక్రమంలో పెరుగుకుమార్, వీరవెళ్లి రవి, మంద శంకర్, తదితరులు ఉన్నారు.

డీఎస్పీకి బొకే అందజేత

మహబూబాబాద్ రూరల్: డీఎస్పీ తీర్థాల సత్యనారాయణను బీఆర్ఎస్ టౌన్ యూత్ జనరల్ సెక్రెటరీ రామరాజు యాకన్న శనివారం డీఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు.

గ్రంథాలయ వారోత్సవాలు

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థినులకు వ్యాసరచన, ఉపన్యాసం, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయలలిత, ఇనుగుర్తి జెడ్పీఎస్ఎస్ హెచ్‌ఎం రాజేందర్, పీఈటీ రాజేందర్, లైబ్రేరియన్ శాలిని పాల్గొన్నారు.

గోరింటతో అందం.. ఆరోగ్యం



తొర్రూరు: అరచేతికి అందాన్నిచ్చే గోరింటతో ఆరోగ్యం సాధ్యమని ధర్మశ్రీ ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకురాలు ధరావత్ విమల తెలిపారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ధర్మశ్రీ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం డివిజన్ కేంద్రంలో గోరింటాకు సంబరాలు నిర్వహించారు. ట్రస్టు ప్రతినిధులు ఝాన్సీ, లక్ష్మీ, మంజుల, విజయ పాల్గొన్నారు.

చిన్నారుల 'చంద్రయాన్'



తొర్రూరు రూరల్: మండలంలోని వెంకటాపురం ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులు వినూత్న రీతిలో చంద్రయాన్‌–3 నమూనా ప్రయోగాన్ని శనివారం చేపట్టారు. చంద్రయాన్ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ చిన్నారులు ప్రయోగాన్ని చేపట్టారు.

సీహెచ్‌సీలో పరిశీలన

గార్ల: గార్లలోని 30 పడకల సీహెచ్‌సీ ఆస్పత్రిలో కావల్సిన మౌలిక వసతులను శనివారం జిల్లా ఏరియా ఆస్పత్రి ఆఫీస్ సూపరింటెండెంట్ స్వాతికుమార్ పరిశీలించారు. కావల్సిన ఎక్స్‌రే మిషన్, ఆపరేషన్ థియేటర్‌లో కావల్సిన పరి కరాలు, మౌలిక సదుపాయాలు, ఫర్నీచర్ లను గుర్తించారు. నివేదికను రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కార్యాలయానికి పంపించి త్వరగా తెప్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట సీహెచ్‌సీ సూపరింటెండెంట్ రాజేష్, డాక్టర్లు రమేష్, సత్యనారాయణ, హనుమంతరావు పాల్గొన్నారు.